ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

రేపటి నుంచి పుస్తక సంత

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు హెచ్ఎస్ఆర్ లేవుట్‌లోని స్వాభిమాన ఉద్యానవనంలో ఈ నెల 10 నుంచి రెండు రోజుల పాటు పుస్తక సంత జరుగనుంది. రాష్ట్రంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలు కలసికట్టుగా వీరలోక ట్రస్టు ఆధ్వర్యంలో భారీ పుస్తక సంతను నిర్వహించనున్నాయి. ఈ పుస్తక మేళాను 20 వేల మందికి పైగా పుస్తక ప్రియులు సందర్శించవచ్చునని అంచనా వేస్తున్నట్లు ట్రస్టు సభ్యులు శ్రీనివాస మీడియాకు తెలిపారు. సీఎం సిద్ధరామయ్య ఈ పుస్తక సంతను ప్రారంభిస్తారని 200 మందికి పైగా సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. ఆహార సంతె, సంగీత కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు.



అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన దివ్యాంగులు

జనస్పందన

- సీఎం జనస్పందనకు తరలివచ్చిన జనం
- 12వేలకు పైగా వినతులు... 25వేల మంది ప్రజలు
- జనసంద్రంగా విధానసౌధ ప్రాంగణం



బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆఫీసులు... అధికారులు చుట్టూ ఎంతతిరిగినా సమస్యలు పరిష్కారం కావని నిర్ధారించుకున్న జనం సీఎం సిద్దరామయ్య ఇచ్చిన రెండోవిడత ప్రజాస్పందనకు ఊరూవాడా తరలివచ్చింది. విధానసౌధ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన జనస్పందనకు తెల్లవారుజాము నుంచే ప్రజల రాక ఆరంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల నుంచి తమ గోడు వెళ్ళబోసుకుని ఎంతోకొంత వెసలుబాటు పొందుదామని భావించిన వారికి తగినట్లుగానే ఏర్పాట్లు చేశారు. విధానసౌధ ప్రాంగణంలోని ప్రధానమైన తూర్పు, పడమర, వికాససౌధనుంచి వచ్చే అన్ని దారుల చెంత ప్రత్యేక సౌలభ్యాలు కల్పించారు. వచ్చిన వారికి కూర్చొనేందుకు దాదాపు 15వేలకు పైగా కుర్చీలు ఏర్పాటు చేశారు. శాఖల వారీగా కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటలకు 'జనస్పందన' కార్యక్రమాన్ని సీఎం సిద్ధరామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రందాకా ఇక్కడే ఉంటానని ప్రతి ఒక్కరినీ పలకరిస్తానని ఎవరూ నిరాశచెందాల్సిన పనిలేదని హామీ ఇచ్చారు. ముందుగా మీ పేర్లు, చిరునామాతో పాటు సమస్యను రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. ఆతర్వాత శాఖల వారీగా వారు సూచించిన కౌంటర్‌ల చెంతకు వెళ్ళాలన్నారు. ఇలా వేలాది మంది చేతులలో అర్జీలు పట్టుకుని దీనంగా తమ వేదన చెప్పుకునే ప్రయత్నం చేశారు. వందకుపైగా కౌంటర్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగిస్తూనే వాటికి ఒక నంబర్ జోడించి శాఖల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లకు పంపారు. చిన్నారులు, వృద్ధులు ఆరోగ్యసమస్యలు వివరించే విషయంలో నేరుగా సీఎంకు చెప్పుకునేందుకు ప్రయత్నించారు. సీఎం సిద్దరామయ్య నేరుగా ప్రజల మధ్యకు వెళ్ళి అర్జీలు స్వీకరించారు. సుమారు 20మందికి పైగా దివ్యాంగులను పలకరించిన సీఎం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

12,372 దరఖాస్తుల స్వీకరణ

రెండోవిడత జనస్పందనకు భారీగా జనం వచ్చారు. 12372 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు ప్రకటించారు. ఇం దులో 246 దరఖాస్తులు అక్కడికక్కడే పరిష్కరించగా 12,126 దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపినట్లు తెలిపారు. రెవెన్యూశాఖకు సంబంధించి అత్యధికంగా 3,150 దరఖాస్తులు, హౌసింగ్ విభాగంకు 1500లు, స్త్రీ శిశుసంక్షేమశాఖ 903 దరఖాస్తులు వచ్చాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, అంతరంగిక పాలనా వ్యవహారాలతో కలిపి ఐదుశాఖల నుంచి అర్జీలు స్వీకరించలేదు. శాఖల వారీగా పంపిన దరఖాస్తులకు నెలరోజులలోగా పరిష్కరిస్తామని సీఎం ఆదేశించారు. కాగా నవంబరు 27న నిర్వహించిన తొలివిడత జనస్పందనకు 4030 అర్జీలు రాగా 3738 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. జనస్పందనకు మంత్రులు ప్రియాంకఖర్గే, కృష్ణబైరేగౌడ, సుధాకర్, భైరతీసురేష్ హాజరయ్యారు.



ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎంకు వినతి ఇస్తున్న బౌద్ధసన్యాసులు

- బెంగళూరు నివాసి నవ్యశ్రీ పీజీ చదివానని ఉద్యోగం లేదని వివరించగా ఉద్యోగమేళాలో అవకాశం ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.
- డయాలసిస్‌తో ఇబ్బంది పడుతున్నట్లు సత్యనారాయణ అనే వ్యక్తి చికిత్సకు సాయం చేయాలని వైద్యశాఖ అధికారులకు సీఎం సూచించారు.
- జేజేనగర్ నివాసి కిడ్నీల సమస్య వివరించగా పరిహారానికి హామీ ఇచ్చారు.
- రాయచూరుకు చెందిన మూడేళ్ళబాలుడు శశాంత్ తలసేమియాతో బాధ పడుతున్నవిషయంపై వెంటనే సాయం చేస్తామని భరోసా ఇచ్చారు.
- కోలార్ జిల్లా మాళూరు తాలూకా బంతనహళ్ళి నారాయణస్వామి భూమి ఖాతా సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.
- తుమకూరు జిల్లా శాంతాభాయి బుద్ధిమాంధ్యం చిన్నారితో వచ్చి సాయం కోరగా సీఎం చలించిపోయారు. వెంటనే పరిహారం చెల్లించారు.
- నెలమంగళ కేన్సర్ బాధితురాలు చౌడేశ్వరికి ఆర్థికసాయం భరోసా ఇచ్చారు.
- మైసూరు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల రాజేష్ ఉద్యోగం రెగ్యులరైజ్ చేయాలని కోరగా పరిశీలిస్తానని సీఎం హామీ ఇచ్చారు.



దివ్యాంగురాలిని పలకరిస్తున్న సీఎం

ప్రజల మధ్యనే గడిపిన సీఎం సుమారు వేయిమందికి పైగా ప్రజలతో నేరుగా వినతులు స్వీకరించారు. బెంగళూరులో మహాబోధి పరిశోధనా కేంద్రం తరుపున పలువురు బౌద్ధసన్యాసులు సీఎంకు వినతిని ఇచ్చారు. ఆధ్యాత్మిక గ్రంథాలయ ఆధునికీకరణకు నిధులు కోరారు. బౌద్ధుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.


ప్రతిచోటా ప్రత్యేక సౌకర్యాలు....

జనస్పందనకు వచ్చిన ప్రజలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఉండేలా పక్కా ప్రణాళిక బద్ధంగా నడిపారు. వివిధ జిల్లాల నుంచి రైళ్ళద్వారా వచ్చిన వారికి, బస్సులలో మెజిస్టిక్‌కు చేరుకున్నవారి కోసమే ప్రత్యేకమైన బస్సులను ఏర్పాటు చేశారు. బస్సులలో రాలేనటువంటి వారికి ఇతర వాహనాల ద్వారా పంపారు. విధానసౌధకు చేరుకోగానే సమస్య అడిగి తెలుసుకుని సంబంధిత శాఖ కౌంటర్‌కు పంపారు. సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీలకు బ్యాటరీ కార్లు, వీల్‌ఛెయిర్‌లు ఏర్పాటు చేశారు. ఎక్కడా వినతులతో వచ్చిన వారు ఇబ్బంది పడకుండా చర్యలు కొనసాగాయి. పలువురు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉదయం టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం భోజనం సమకూర్చారు. కాఫీ, టీ కౌంటర్‌లు ఏర్పాటు చేశారు.




అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

కాంగ్రెస్‌లోనూ కమీషన్ల దందా



- 40శాతం కమీషన్ ఇవ్వకపోతే బిల్లులు కావడం లేదు
- మంత్రుల పేరుతో అధికారుల వసూళ్లు
- కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెంపణ్ణ ఆరోపణ



కెంపణ్ణ

బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ 40శాతం కమీషన్ దందా కొనసాగుతోందని రాష్ట్ర కాంట్రాక్టర్‌ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణ సంచలన ఆరోపణ చేశారు. గురవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన బీజేపీ ప్రభుత్వంలో నేరుగా ఎమ్మెల్యేలు, మంత్రులు డిమాండ్ చేసేవారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో వారి పేర్లతో అధికారులు కమీషన్ దంధా సాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు అవినీతిలో భాగస్వామ్యులయ్యారన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్తూ కమీషన్ వసూలు చేస్తున్నారని కెంపణ్ణ ఆరోపించారు. మీకు పనులు కావాలంటే కమీషన్ ఇవ్వాల్సిందేనని పైస్థాయి అధికారులకు ఫీడ్ చేయాల్సి ఉంటుందని బహిరంగంగానే ఆరోపిస్తున్నారన్నారు. ఎందుకు కమీషన్ ఇవ్వాలని చీఫ్ ఇంజనీర్‌లను ప్రశ్నిస్తే మంత్రులు, ఎమ్మెల్యేల వైపు చూపుతున్నారన్నారు. ఏఏ అధికారులు కమీషన్ డిమాండ్ చేస్తున్నది తమ వద్ద సంపూర్ణ సమాచారం ఉందన్నారు. మరిన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇప్పటికే ఐదుగురు అధికారులు తనపై పరువునష్టం దావాలు వేశారన్నారు. ఇదే కారణంతో పేర్లు బహిరంగం చేయలేమన్నారు. సీఎం, డీసీఎంలను కలిసి కమీషన్ల విషయం వివరిస్తా మన్నారు. ప్రతిపక్షనేత ఆశోక్‌ను కలిసి ప్యాకేజ్ టెండర్‌ల సమాచారం ఇస్తానన్నా రు. 40శాతం కమీషన్ వివాదానికి సంబంధించి న్యాయమూర్తి హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ కమిషన్‌కు 7వేల పేజీల ఆధారాలు సమర్పించానన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలోని 40శాతం కమీషన్ విషయాన్ని కూడా సమయం వచ్చినప్పుడు ఆధారాలతో సహా ఇస్తామన్నారు. పోలీసు హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, బీబీఎంపీ, కర్ణాటక రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి పనులను ప్యాకేజీ పద్దతితో ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి పనులు అప్పగిస్తున్నారని మండిపడ్డారు.

బీజేపీ పాలనలో సంచలనం..

ఏడాది కిందట బీజేపీ ప్రభుత్వంలో సీఎం బసవరాజ్ బొమ్మైపై కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణ నేరుగా 40శాతం కమీషన్ ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని అప్పటి ప్రతిపక్షంలోని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల అస్త్రంగా వాడుకున్నారు. చివరకు పేసీఎం పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. ఇదే అంశం ఎన్నికలలో హాట్ టాపిక్‌గా మారి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఓడేందుకు కారణమైంది. కాంగ్రెస్ పాలనలో అవినీతికి తావు ఉండదని ప్రచారం చేశారు. గతంలో బీజేపీ ప్రభుత్వంపై 40శాతం కమీషన్ ఆరోపణలు చేసిన కెంపణ్ణ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా అవే ఆరోపణలు చేశారు. బీజేపీ ఇదే అంశాన్ని లోక్‌సభ ఎన్నికల వేళ ప్రచారాం చేసుకునేందుకు సిద్దమవుతున్నట్లు సమాచారం.

విచారణ జరపాలి : బీజేపీ

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణ కాంగ్రెస్ ప్రభుత్వంలో 40 శాతం కమీషన్ వ్యవహారం జరుగుతోందని తీవ్ర ఆరోపణలు చేశారని దీనిపై జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ స్వచ్ఛందంగా విచారణ జరుపాలని బీజేపీ డిమాండ్ చేసింది. బెంగళూరు మల్లేశ్వరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం అధికార ప్రతినిధి అశ్వత్థనారాయణ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీతో విచారణ జరిపిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని దర్యాప్తు పరిధిలో తాజాగా కెంపణ్ణ చేసిన ఆరోపణలను కూడా చేర్చాలన్నారు. కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన 3 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ముఖ్యమంత్రిపై స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలే అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయని ఆరోపించారు. కేంద్రంపై అభాండాలు వేసే ముందు రాష్ట్రంలో కరువు పరిస్థితిని ఎంతమేరకు నిభాయించామనే అంశంపై సీఎం ఆత్మపరీశలన చేసుకోవాలన్నారు.


అంతా బోగస్

- 'అగ్నిపథ్'తో యువతకు ఒరిగిందేమీ లేదు
- నిరుద్యోగుల దృష్టి మరలుస్తున్న కేంద్రం
- ఏఐసీసీ అధికార ప్రతినిధి అంశుల్ అవిజిత్



మీడియాతో మాట్లాడుతున్న ఏఐసీసీ అధికార ప్రతినిధి

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం గొప్పలు చెప్పుకుంటున్న 'అగ్నిపథ్' పూర్తిగా బోగస్ అని ఏఐసీసీ అధికార ప్రతినిధి అంశుల్ అవిజిత్ ఆరోపించారు. బెంగళూరులోని కేపీసీసీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయిందని. ఈ సమయంలో యువత దృష్టిని మరల్చేందుకు కేంద్రం నిరంతర ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 'అగ్నిపథ్' పరీక్షలు రాసిన 1.50 లక్షల మంది నిరుద్యోగుల హక్కులను కాపాడేందుకు స్వయంగా రాహుల్‌గాంధీ రంగంలోకి దిగారన్నారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ దేశంలో విలయతాండవం చేస్తున్న నిరుద్యోగ సమస్యపై పల్లెత్తు మాట మాట్లాడలేదన్నారు. దేశంలో 29 ఏళ్ళ లోపు నిరుద్యోగుల సంఖ్య 4 కోట్ల పైచిలుకే ఉందని, నిరుద్యోగుల సంఖ్య ప్రతియేటా 40 శాతం మేరకు పెరుగుతోందన్నారు. నిరుద్యోగులకు కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి చూపారన్నారు. 'అగ్నిపథ్' పథకంలో చాలా లోపాలున్నాయని స్వయం గా మాజీ సైనికులే ఆరోపిస్తున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. అందువల్లే ఈ పథకానికి ఆదరణ బాగా తగ్గిపోయిందన్నారు. 2021-22లో సైన్యంలో చేరేందుకు 34 లక్షల మంది యువత దరఖాస్తు చేసుకోగా, 2023-24లో కేవలం 10 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. అగ్నిపథ్‌లో చేరే వారికి ఆరోగ్య సదుపాయాలు, కరువు భత్యం, ఇతరత్రా సదుపాయాలు ఉండవని మాజీ సైనికులకు లభించే సదుపాయాలు కూడా లేవని ఆయన విమర్శించారు. దేశానికి రక్షణ కల్పించే సైనిక రంగాన్ని కేంద్రం తప్పు దోవ పట్టించడం తగదని, యువతను కేంద్రం ఎలా దారితప్పిస్తున్నదనడానికి ఇదో ఉదాహరణ అన్నారు. కాగా దేశంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారంటూ మోదీ చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కార్పొరేట్ రంగం తప్ప బీజేపీ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదని, పేదలు మరింత పేదరికంలోకి మగ్గిపోయి విలవిలలాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంపూర్ణ న్యాయం సా ధ్యమన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీలతో పేదల బతుకులు మారుస్తామన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రమేష్ బాబు పాల్గొన్నారు.



దేశసమైక్యత గుర్తుకు రాలేదా..?

గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు

- మోదీకి సీఎం సిద్దరామయ్య సూటి ప్రశ్న

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'మా పన్ను మా హక్కు' అంటూ డిల్లీలో తాము బుధవారం జరిపిన ధర్నాపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తిప్పికొట్టారు. బెంగళూరులో గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్రంపై చేసిన ఘాటైన విమర్శలను ఆయన ప్రస్తావించారు. యూపీఏ హయాంలో నరేంద్రమోదీ చేసిన విమర్శలు దేశసమైక్యతకు, భద్రతకు భంగకరం కాదా? అని సిద్ధరామయ్య ఘాటుగా ప్రశ్నించారు. 2008లో గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ ప్రతియేటా తాము కేంద్రానికి రూ 40వేల కోట్లు పన్నుల రూపంలో ఇస్తుంటే తమకు ఇందులో 2.5 శాతం కూడా తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారన్నారు. 2012లో గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలోనూ గుజరాత్ రాష్ట్రం కేంద్రానికి పన్నుల రూపంలో 60వేల కోట్లు ఇస్తోందని అయితే తమకు తిరిగి వస్తున్న మొత్తం చాలా తక్కువని పలుమార్లు పేర్కొన్నారని గుజరాత్ బిచ్చగాళ్ళ రాజ్యమా అన్ని కూడా ప్రశ్నించారన్నారు. కనీసం ఒక ఏడాది తమ రాష్ట్ర పన్నులను తామే అభివృద్ధికోసం వినియోగించుకునే అవకాశం కల్పించాలని కూడా మోదీ కోరారని గుర్తుచేశారు. ఇప్పుడు తాము కూడా ఇదే డిమాండ్ చేస్తుంటే ప్రధాని మోదీకి ఒక్కసారి దేశ సమైక్యత, దేశభద్రత గుర్తుకు వచ్చాయని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో మోదీ ప్రసంగం ఒక ప్రధానిగా కాకుండా పార్టీ నేతగా ఉందని కర్ణాటకకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని సిద్ధరామయ్య ప్రకటించారు.

లే కే డి


- లగ్జరీ కార్లు కొనిస్తానంటూ రూ.6.20 కోట్ల మోసం





- డబ్బులు అడిగితే అత్యాచారం కేసు పెడతానంటూ బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైద్య దంపతులు

బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): లగ్జరీ కార్లు తక్కువ ధరకే కొనిస్తామని నమ్మించిన ఓ మహిళ నగరంలోని విజయనగర్‌కు చెందిన వైద్య దంపతులకు రూ.6.20కోట్లు మోసం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ గిరీష్ దంపతులు బీఈఎల్ లేఅవుట్ ఐశ్వర్యగౌడ అనే మహిళపై విజయనగర్ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయనగర్‌లోని ఎంసీ లేఅవుట్‌లో గిరీష్ దంపతులకు ఆసుపత్రి ఉంది. 2022 మార్చిలో కాస్మొటిక్ సర్జరీ కోసం ఐశ్వర్యగౌడ చికిత్సలు పొందారు. ఇలా పరిచయం అయిన ఐశ్వర్యగౌడ తాను రియల్టర్, సెకెండ్‌హ్యాండ్ లగ్జరీ కార్ల డీలర్‌గా పరిచయం చేసుకున్నారు. ఇలా పరిచయం అయిన ఐశ్వర్య గౌడ లగ్జరీ కార్లు కొనిస్తానంటూ నమ్మించారు. ఇలా ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.2.75కోట్లు, నగదు రూపంలో రూ.3.75 కోట్లను రెండువిడతలుగా రూ.6.20కోట్లు ముట్టచెప్పారు. ఆతర్వాత ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పాటు సమయానికి కార్లు చూపక వాయిదాలు వేస్తూ వచ్చారు. డాక్టర్ గిరీష్ ఓసారి తీవ్రంగా మాట్లాడడంతో విజయనగర్ క్లబ్ వద్దకు రావాలని ఐశ్వర్య సూచించడంతో అక్కడికి వెళ్ళారు. అక్కడ ఆమె డాక్టర్ దంపతులతో గొడవకు దిగారు. డబ్బులు డిమాండ్ చేస్తే అత్యాచారం కేసు పెడతానంటూ హెచ్చరించారు. మీడియాకు తెలిపి మర్యాద తీస్తానంటూ సవాల్ చేశారు. తనతో జాగ్రత్తగా ఉండాలని మరోసారి గొడవ చేయకుండా ఉండాలంటే రూ.75లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లుగా విజయనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఐశ్వర్యగౌడ కోసం గాలింపులు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.06	1,613.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	177	9,398
సామర్థ్యం (టీఎంసీలు)	9.48	45.43

సీఎం జనస్పందనకు జిల్లా అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇతర అధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 8: బెంగళూరులోని శక్తికేంద్ర విధాన సౌధ ప్రాంగణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలో గురువారం నిర్వహించిన జనస్పందన కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఇందులో భాగంగా బళ్లారి జిల్లా పరిపాలనా కార్యాలయం కేస్వాన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాపంచాయితీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ శరణప్ప, డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్ పాల్గొన్నారు.

బాలికలకు 40 సైకిళ్ల పంపిణీ

బళ్లారి సిటీ. ఫిబ్రవరి 8: బాలల భద్రతా వారోత్సవాల నేపథ్యంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలో హైస్కూల్ బాలికలకు 40 సైకిళ్లను జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఏఎస్ బసప్ప గ్యాలరీ ద్వారా సందేశమిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా పంచాయితీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌదాగర్ మసీదులో ప్రార్థనలు



నమాజ్‌లో పాల్గొన్న ముస్లిం ప్రముఖులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 8 : అల్లాను స్మరించడం మనిషికి ఎంతో పవిత్రమైనదని అబ్దుల్ సయ్యద్ నిజామి గురువులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప పట్టణం సౌదాగర్ మసీదులో నమాజ్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి అబ్దుల్ సయ్యద్ నిజాం మాట్లాడుతూ భగవంతుడు ప్రతి ఒక్కరికీ అన్ని విధాలా సహకారాలు అందిస్తాడని తెలిపారు. శాంతియుతంగా భగవంతుడిని మౌనంతో ప్రార్థిస్తే మనిషికి ఎంతో ఉత్తమ మార్గం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రముఖులు అబ్దుల్ నబీ, మహమ్మద్ నౌషద్ అలీ, సౌదాగర్ మసీదు మాజీ అధ్యక్షులు అండి హుస్సేన్ బాషా, ముస్లింలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి ఎంపీ ప్రకాశ్ వర్ధంతి



ప్రకాశ్‌కు నివాళులర్పిస్తున్న లతామల్లికార్జున

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 8: మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంపీప్రకాశ్ 13వ వర్ధంతిని హరప్పనహళ్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంపీ లతామల్లికార్జున ప్రకాశ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంపీ. అంజినప్ప, కుబేరప్ప, పురపాలక సంఘం సభ్యులు వెంకటేశ్, గణేశ్, నాయకులు మల్లికార్జున, కొట్రేశప్ప, గౌతమప్రభు, శివకుమార స్వామి, వసంతప్ప,చిక్కేరి బసప్ప,రామప్ప, ప్రదీప, ఉదయకుమార్, శివరాజు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ సీటుపై మళ్లీ రాజకీయాలు

- ముండ్లూరు, ముల్లంగి కుటుంబాల మధ్య పోరు
- నెల ముందే మేయర్ పదవి కోసం పాచికలు



ముల్లంగి నందీష్‌బాబు



ముండ్లూరు ప్రభంజన్ కుమార్

బళ్లారి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత బళ్లారి మేయర్ పదవీ కాలం మార్చి రెండో వారంతో ముగియనుంది. తరువాత కాబోయే మేయర్ పదవి కోసం కొందరు కార్పొరేటర్లు అప్పుడే రాజకీయ ప్రయత్నాలు ప్రారంభించారు. మామూలుగా అయితే మేయర్ పదవీ కాలం ఏడాది ఉంటుంది. 2023లో మేయర్ డి. త్రివేణి రాజీనామా చేయడంతో మధ్యలో రెండు నెలల సమయం కోసం ఎస్సీ మహిళ అయిన శ్వేత సోము జనవరిలో ఎన్నికయిన విషయం విదితమే. ఆమె పదవీకాలం మార్చిలో ముగుస్తుంది.

రాబోయే మేయర్ పదవి జనరల్ క్యాటగిరీకి రిజర్వు అయింది. ఈ సీటు కోసం కమ్మసామాజిక వర్గానికి చెందిన ముండ్లూరు ప్రభంజన్ కుమార్, అలాగే ముల్లంగి రవీంద్రబాబు కుమారుడు నందీష్ బాబులతో పాటు అదే సామాజిక వర్గానికి చెందిన ముండ్లూరు విక్కీ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు మైనార్టీ కార్పొరేటర్ అయిన ఆసీఫ్ కూడా రేసులో ఉన్నానంటున్నారు.

ఆశావహుల గురించి...

ముండ్లూరు ప్రభంజన్ కుమార్ వాళ్ల కుటుంబానికి బళ్లారిలో రాజకీయంగా మంచి పలుకుబడి ఉంది. ప్రభంజన్ వాళ్ల తాత ముండ్లూరు రామప్ప, ఆయన పెద్దనాన్న ముండ్లూరు దివాకర్‌బాబు గతంలో మంత్రులుగా పనిచేశారు. ముండ్లూరు ప్రభంజన్ తండ్రి ముండ్లూరు చిట్టీ గురించి బళ్లారిలో తెలియని వాళ్లు ఉండరు. పైగా మంత్రి శ్రీరాములు, నాగేంద్ర లాంటి వారితో పాటు నారా సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే భరత్‌రెడ్డిలకు ఆయన అత్యంత సన్నిహితంగా మసలుతుంటారు. ముండ్లూరు వాళ్లకు ముల్లంగి రవీంద్రబాబు స్వయానా అల్లుడు కావడం గమనార్హం. ఆయన కుమారుడే నందీష్ బాబు. ఆయన గతంలో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి సోదరుడు, బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి కుమారుడిపై పోటీచేసి విజయం సాధించారు. తరువాత జనరల్ మహిళ కు మేయర్ పదవి రిజర్వు కావడంతో మేయర్‌గా రాజేశ్వరిని అదృష్టం వరించింది. మార్చిలో మేయర్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అప్పుడే బళ్లారిలో మేయర్ ఆశావహులు రాజకీయ పావులు కదుపుతున్నారు. కొందరైతే కార్పొరేటర్ల ఇంటికి వెళ్లి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరి కొందరు విందు రాజకీయాలకు తెర లేపారు. ఇక వీరితో పాటు అదే సామాజిక వర్గంకు చెందిన కమ్మ విక్కీ కూడా మేయర్ పదవి రేసులో ఉన్నానని అంటున్నారు. ఇక అసీఫ్ కూడా నాకు మేయర్ పదవి ఇవ్వాలని మంత్రిని కోరుతున్నట్లు సమాచారం.

విమ్స్ మైదానానికి విద్యుత్ కాంతులు

బళ్లారి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విజయనగర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) మైదానం విద్యుత్ కాంతులతో కళకళ లాడుతోంది. బళ్లారి నగర మధ్యలో ఉండే ఈ మైదానంలో రోజూ ఉదయం, సాయంత్ర వందలాది మంది ప్రజలు వాకింగ్ చేయడానికి, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, ఆటలు ఆడేందుకు వస్తుంటారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ మైదానం ఇంత కాలం విద్యుత్ సౌకర్యం లేక చీకటిగా ఉండేది. సాయంత్ర వేళ వాకింగ్‌కు వెళ్లేవారు కూడా చీకటిలో ఏమిజరుగుతుందోనని భయపడేవారు. ఇలాంటి పరిస్థితులను తెలుసుకున్న బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి తన సొంత నిధులతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. మైదానం చుట్టూ విద్యుత్ స్తంభాలు నాటించి లైట్లు ఏర్పాటు చేయించారు. సుమారు రూ. 6 లక్షల పైగా నిధులను వినియోగించారు. నగరంలో ఉండే మున్సిపాలిటీ మైదానంలో కూడా తన సొంత నిధులతో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు.



మైదానంలో వాకింగ్ చేసి సేద తీరుతున్న జనం



ఎమ్మెల్యే భరత్ రెడ్డి

డ్యూటీ ముగించుకుని వచ్చి వాకింగ్ చేస్తున్నాం - వైద్యులు

విమ్స్ ఆసుపత్రిలో ఈవినింగ్ డ్యూటీ ముగించుకుని వచ్చి వాకింగ్ చేస్తున్నామని పలువురు డాక్టర్లుతెలిపారు. ప్రస్తుతం ఎంతో ఉపయోగకరంగా ఉందని విమ్స్‌లో వైద్యులుగా పనిచేస్తున్న వారితో పాటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా తెలిపారు.

హాస్టల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ చీకలపర్వి

రాయచూరు, ఫిబ్రవరి 8 : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యార్థి హాస్టళ్లలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘం జిల్లాధ్యక్షుడు మహేశ్ చీకలపర్వి డిమాండ్ చేశారు. వేతనాల విడుదలలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరశిస్తు గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో విద్యార్థి వసతి గృహాల కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహేశ్ చీకలపర్వి, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్లలో పని చేస్తున్న అనేక మంది కార్మికులకు నెలల తరబడిగా జీతాలు చెల్లించడం లేదన్నారు. కొన్ని చోట్ల ఏడు మాసాల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండే దుస్థితి తలెత్తిందన్నారు. జిల్లాధికారి జోక్యం చేసుకుని కార్మికుల వేతనాలు విడుదల చేయాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహేశ్ చీకలపర్వి, రెండు రోజుల్లోగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే పనులను బహిష్కరించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



డీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐయూటీయూసీ నేతలు

అయ్యప్పస్వామి పూజల్లో మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 08 : బళ్లారి నగరంలో బీజేపీ నాయకుడు కృష్ణ స్వామి (కిట్టు) నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన శ్రీ అయ్యప్పస్వామి పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరాములు, జేడీఎస్ పార్టీ ప్రముఖులు మీనళ్లి తాయణ్ణ, కార్పొరేటర్ గోవిందరాజులు, బీజేపీ నాయకులు నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పూజలకు వచ్చిన వీరిని కృష్ణ స్వామి మర్యాద పూర్వకంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

పరుగు పందెంలో రాణించిన శ్రీదేవికి సన్మానం



శ్రీదేవిని సన్మానిస్తున్న యల్లాలింగనగర్ వార్డు వాసులు, కౌన్సిలర్లు

సిరుగుప్ప, ఫిబ్రవరి 08 : రన్నింగ్ రేస్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మొదటి స్థానంలో విజయం సాధించిన శ్రీదేవికు వార్డు ప్రజలు ఘనంగా సన్మానం చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో యల్లాలింగ నగర్‌లో 16వ వార్డులో కళాకారుడు హార్మోనియం మాస్టర్ వీరణ్ణగౌడ కుమార్తె శ్రీదేవి ఇటీవల పరుగుపందెంలో మొదటి స్థానంలో వంద, 1500 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో విజేతలయ్యారు. ఈ నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ నాగరాజు, మహదేవ, కాంగ్రెస్ నాయకులు కోటిరెడ్డి, మల్లికార్జునగౌడ, వార్డు వాసులు భాస్కర్, సమక్షంలో ఆమెకు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. రానున్న రోజుల్లో రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలని శ్రీదేవికి ప్రోత్సాహమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 08 : బళ్లారిలో హెచ్‌పీ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేసే వన్నూరుస్వామి రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. అతడు గురువారం శివపురం గ్రామం నుంచి బళ్లారికి ద్విచక్రవాహనంలో వెళుతూ నూతన ఎయిర్‌పోర్టు మెయిన్ గేట్ వద్ద రోడ్డుపై ఓ ఎద్దును బలంగా ఢీకొని కిందపడ్డాడు. ప్రమాదంలో ఎద్దు మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన వన్నూరుస్వామిని స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతడు మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై బళ్లారిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎస్‌జీటీ విద్యార్థినులకు వర్సిటీ ర్యాంకులు



రష్మి, ఐశ్వర్య, బి సవిత, పల్లవి

బళ్లారిసిటీ, ఫిబ్రవరి 8: విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ 2022-23 సంవత్సరానికిగాను అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ర్యాంకులను ప్రకటించింది. శ్రీగురు తిప్పేరుద్ర కళాశాలలో బికాం చదువుతున్న విద్యార్థిని రష్మికి మొదటి ర్యాంకు, సవితకు 9వ ర్యాంకు, పల్లవికి 10వ ర్యాంకు ఐశ్వర్యకు 3వ ర్యాంకు వచ్చినట్లు కళాశాల అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ నాగరాజ్ తెలిపారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ రుద్రప్ప, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లింగధారణ చేపట్టిన ధ్యాన మాస్టర్లు



హరిజన ఈరమ్మను సత్కరిస్తున్న ధ్యాన కేంద్ర మాస్టర్లు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 8: బళ్లారి తాలూకాలోని సిరివార గ్రామంలో హరిజన ఈరమ్మ అనే మహిళను గురువారం ఆమె ఇంట్లో బళ్లారికి చెందిన ధ్యాన మాస్టర్లు నాగిరెడ్డి, రుద్రపరెడ్డి, పంపారెడ్డి, సుంకప్ప, నరసమ్మ, రుద్రయ్యచౌదరి సత్కరించారు. గతంలో ధ్యానకేంద్రంలో ఈరమ్మ తిన్నప్లేట్‌ను దూరంగాఉంచేవారని, ధ్యానానికి వచ్చే ప్రతిఒక్కరూ సమానమేనని అందుకే ఇంటికి వెళ్లి లింగధారణ చేపట్టినట్లు పంపారెడ్డి తెలిపారు.

పిల్లల్లో మనోధైర్యాన్ని నింపితే ఉత్తమ ఫలితాలు : అనిల్‌బాబు





డ్రీమ్‌వరల్డ్ స్కూల్లో విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 8: పిల్లల మనస్తత్వాన్ని గుర్తించి వారిలో మనోధైర్యాన్ని నింపి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన అవసరం విద్యాసంస్థలపై ఉందని దీన్ని తమ వంతుగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని డ్రీమ్‌వరల్డ్ స్కూల్ చీఫ్ అనిల్‌బాబు పేర్కొన్నారు. బళ్లారిలోని కప్పగల్లురోడ్డులో ఉన్న డ్రీమ్‌వరల్డ్ స్కూల్లో బుధవారం వార్షికోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం బళ్లారిలోని డ్రీమ్ వరల్డ్ స్కూల్లో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అనిల్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. పిల్లల ప్రతిభను గుర్తించడంతోపాటు వారిలోని భయాందోళనలను తొలగించి ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఈసందర్భంగా ఇండియన్ ఆర్మీ అనే అంశంపై కొరియోగ్రాఫర్ బెన్ని, సంగీత ఉపాధ్యాయులు అశ్విని ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన పలునాటికలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్

అథ్లెటిక్ పోటీ విజేతలకు ప్రశంసాపత్రాలు



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయుడు పొన్‌నాగేశ్

హోసూరు ఫిబ్రవరి 8: హోసూరు సమీపంలోని అందివాడీ స్టేడియంల్లో వాకర్స్ అసోసియేషన్ తరఫున రెండు రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు ట్రాక్ ఫీల్డ్ పోటీలు నిర్వహించారు. ఇందులో వెయ్యి మందికి పైగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థులను 12,14, 16, 18 ఏళ్లలోపు షాట్‌పుట్, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, వంటి నాలుగు విభాగాలుగా విభజించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ విజయలక్ష్మి ఎస్ఎంసీ మంజులతోపాటు కార్పొరేషన్ మిడిల్ స్కూల్ బేడరపల్లి కి చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో 8 వ తరగతి విద్యార్థి సెల్వాన్ మాదేష్ షాట్‌పుట్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్ 12 విభాగంలో 6 వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్ 50 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడోవార్డు కౌన్సిలర్ రజనీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

హోసూరు(మత్తిగిరి) ఫిబ్రవరి 8: రాష్ట్ర హక్కులను హరిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఖండించింది. హోసూరు రాంనగర్ అన్నా విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనకు సీపీఎం హోసూరు నగర కార్యదర్శి జయరామన్ నాయకత్వం వహించారు. యూనియన్ కార్యదర్శి రాజా రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య , డిప్యూటీ మేయర్ ఆనందయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శేఖర్, సీపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మదియన్, మాజీ ఎమ్మెల్యే మురుగన్ విశాఖ మున్సిపల్ కార్యదర్శి రామచంద్రన్, డీకే వనవేందన్, కాంగ్రెస్ త్యాగరాజన్, యువజన సంఘం అబ్దుల్ రెహమాన్ పాల్గొని. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ప్రసంగించారు. గత పదేళ్లలో బీజేపి ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమానంగా చూడకుండా, ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి అనుగుణంంగా నిధులు కేటాయించడంలేదన్నారు. ఫెడరలిజం సూత్రానికి విరుద్ధంగా రాజ్యాంగాలను ఉల్లంఘిస్తూ నివేదికలు జారీ చేస్తూ శాసనసభల్లో ఆమోదించిన బిల్లులను ఆమోదించేందుకు నిరాకరిస్తున్న గవర్నర్లు, రాష్ట్రాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. డిఎంకే అధికారులు ఎల్లోర మణి, రాష్ట్ర యువజన మంత్రి శ్రీనివాసన్, సుమన్, కలైచెళియన్, రాము, శక్తివేల్, తిమ్మరాజ్, భాగ్యరాజ్, అరసనట్టి రవి, తదితరులు నినాదాలు చేశారు.

అగ్గొండపల్లిలో 20 ఏళ్ల తర్వాత ఎద్దుల పండుగ

హోసూరు(సిఫ్‌కాట్) ఫిబ్రవరి 8: హోసూరు సమీపంల్లోని అగ్గొండపల్లి గ్రామంల్లో 20 ఏళ్ల తర్వాత జరిగిన ఎద్దుల పండుగ జరిగింది. వెయ్యికి పైగా ఎద్దులు పాల్గొన్నాయి. పండుగల్లో ఎద్దులను పట్టుకునేందుకు వచ్చిన వారికి తీవ్ర గాయాలు ఏర్పడ్డాయి. హోసూరు సమీపం బైరమంగలం వద్ద ఉన్న అగ్గొండపల్లి ల్లో 20 ఏళ్ల క్రితం ఈ పండుగ జరుపుకున్నారు. ఈ ఎద్దుల పండుగకు గ్రామస్తులు, దేవాదాయ శాఖ అధికారులు, కెలమంగలం పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో ఎద్దుల పండుగల్లో గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెయ్యికి పైగా ఎద్దులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.



పోటీలో పాల్గొన్న ఎద్దులు

ఉపాధి కూలీలకు తక్షణం డబ్బులు చెల్లించాలి



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న జనసైన్య నాయకులు

- జనసైన్య జిల్లా అధ్యక్షుడు రమేశ్ వడవాటి

రాయచూరు, ఫిబ్రవరి 8 : తాలూకా పరిధిలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ పథకం కింద పనులు చేసిన కూలీలందరికి వెంటనే డబ్బులు చెల్లించాలని జనసైన్య యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ వడవాటి డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం చేసిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద కూలీలతో కలిసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన రమేశ్ వడవాటి, చేపట్టిన పనులు పూర్తైన 15 రోజుల్లోగానే కూలీ డబ్బులు చెల్లించాలని నిబంధనలు చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా ఉండడంతో కుటుంబాల నిర్వహణ కార్మికులకు భారంగా మారిందన్నారు. కరువు నేపథ్యంలో వలసలు నివారించేందుకు ఉద్దేశించిన ఉపాధిహామీ పథకం అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యంగా మారినట్లు ఆయన ఆరోపించారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివాముల దగ్ధం

రాయచూరు, ఫిబ్రవరి 8: జిల్లాలోని అరకేరా తాలూకా భూమనగుండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతు హనుమంతు తనతో పాటు ఇతర రైతులకు సంబంధించిన గడ్డిని తనపొలంలో నిల్వ చేసి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. అప్పటికే దాదాపు లక్ష రూపాయిలు విలువ చేసే రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది తక్షణం అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

బాబా ఆమ్టే (వర్ధంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత బాబా ఆమ్టే 1914 డిసెంబరు 26న మహారాష్ట్రలోని హింగన్‌ఘాట్‌లో జన్మించారు. అసలుపేరు మురళీధర్ దేవిదాస్ ఆమ్టే. ప్రముఖ సమాజ సేవకులు. ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల కోసం జీవితాంతం కృషి సల్పారు. కుష్టు రోగుల పాలిట దేవుడిగా మారారు. చంద్రాపూర్ జిల్లాలో 'ఆనంద్‌వన్' ఆశ్రమాన్ని స్థాపించి అక్కడే జీవితాన్ని గడిపారు. క్విట్ ఇండియా, నర్మదా బచావో ఉద్యమాలలో కీలకంగా వ్యవహరించారు. పద్మశ్రీ, రామన్ మెగసెసె, గాంధీ పీస్ ప్రైజ్, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల అవార్డు సహా అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. 2008 ఫిబ్రవరి 9న కన్నుమూశారు.

యోశినోరి ఓశుమి (పుట్టినరోజు)



యోశినోరి ఓశుమి 1945 ఫిబ్రవరి 9న జపాన్ దేశంలో జన్మించారు. జీవకోశ శాస్త్రవేత్త (సెల్ బయోలజిస్ట్). పరిశోధనలు, ఆవిష్కారాలకు పేరొందిన టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్. ప్రత్యేకించి ఆటోఫాగిలో పేరొందారు. 2016లో నోబెల్ పురస్కారం అందుకున్నారు. జపాన్‌కు చెందిన 25వ నోబెల్ పురస్కార గ్రహీత. క్యోటో ప్రైజ్, బ్రేక్ థ్రూ ప్రైజ్, పర్సన్ ఆఫ్ కల్చరల్ మెరిట్, గైర్డ్‌నర్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ అవార్డ్ తదితర పురస్కారాలు అందుకున్నారు.

నేటి నుంచి బీజేపీ 'గ్రామ చలో'



హెచ్.గొల్లహళ్ళిలో విజయేంద్రకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామ చలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ ప్రకటించింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర యశ్వంతపుర శాసనసభా నియోజకవర్గం పరిధిలోని హెచ్.గొల్లహళ్ళిలో గురువారం లాంఛనంగా చలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన రాష్ట్రంలోని 28వేల గ్రామాలు, 19వేల నగర బూత్‌లలో 42 వేల మంది కార్యకర్తలు అభియానలో పాల్గొంటారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశలో గ్రామ ప్రజలతో పార్టీ కార్యకర్తలు మమేకం అవుతారన్నారు. ప్రధాని కల సాకారం కావాలంటే గ్రామాల సమగ్ర అభివృద్ధి జరుగాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తి కి కూడా అందాలన్నదే ప్రధాని ఉద్దేశమన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ అనుకూల గాలులు బలంగా వీస్తున్నాయని ప్రజలంతా మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావాలని ముక్తకంఠంతో కోరుకుంటున్నారన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో అనూహ్యమైన మార్పులు తెచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బెంగళూరు పర్యటనలో కొద్దిగా మార్పు జరిగిందని ఈ నెల 10న రాత్రి ఆయన ఢిల్లీ నుంచి నేరుగా మైసూరుకు చేరుకుంటారని 11న ఉదయం ఆయన చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటారని సా యంత్రం సుత్తూరు జాతరలో పాల్గొంటారన్నారు. కాగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఢిల్లీలో బుధవారం మధ్యాహ్నం మాంసాహారం సేవించి రాత్రి సుత్తూరు మఠానికి హాజరు కావడాన్ని దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. సిద్ధరామయ్య తాను ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అనే విషయాన్ని మరిచిపోతున్నారని విమర్శించారు. సిద్ధరామయ్య మాటలకు చేతలకు పొంతనే ఉండదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల విషయంలో ఎలాంటి గందరగోళం లేదని పార్టీ అధిష్టానం ఏకాభిప్రాయంతోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు.

లోక్‌సభలో మా ఎంపీ నోరు నొక్కేశారు

● డీసీఎం డీకే శివకుమార్ ఆగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో తమ పార్టీ ఎంపీ డీకే సురేష్‌కు తన అభిప్రాయాలను సభకు చెప్పే అవకాశం ఇవ్వకుండా నోరు నొక్కేయడం అత్యంత దారుణమని ఆయన సోదరుడైన కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్రం తరుపున కాకుండా ఎంపీననే సంగతిని కూడా మరిచి అహంకారపూరితంగా మాట్లాడారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు సీఎం, డీసీఎం, మంత్రులు ఢిల్లీకి వస్తే బీజేపీ నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. బాధ్యత మరిచిన ఎంపీలకు ఇది సిగ్గుచేటన్నారు. కర్ణాటక ఎంపీ డికె.సురేష్ ఎక్కడా దేశ విభజన గురించి మాట్లాడలేదని బీజేపీ తనకు కావాల్సిన రీతిలో వక్రీకరించి ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలు మీడియాలో చాలా స్పష్టంగా వచ్చాయని అవసరమైతే వాటిని తెప్పించుకుని చూడాలన్నారు. దేశ సమైక్యత గురించి బీజేపీ ఆర్ఎస్ఎస్ ల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన ఖర్మ తమకు పట్టలేదన్నారు.

నేడు కర్ణాటక కళోత్సవం ప్రారంభం

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సంగీతం, నృత్యం, నాటకాలను, ఇతర ప్రముఖ కళలకు సంబంధించిన కళాకారులందర్నీ ఒకే వేదికపైకి తీసుకురానున్నారు. ఈ ఉత్సవం 9న ప్రారంభమై 24 వరకు జరుగనుంది. కర్ణాటక కళోత్సవాన్ని నగరంలోని రవీంద్రకళాక్షేత్ర ఆరుబయట మందిరంలో నిర్వహించనున్నారు. ఉత్సవంలో భాగంగా సమ్మిలన పేరిట ప్రత్యేక నృత్య రూపకాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మాజీ అదనపు ముఖ్యకార్యదర్శి చిరంజీవి సింగ్, కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు డా.మను బళిగార్, కన్నడ సాంస్కృతిక శాఖ మాజీ కమీషనర్ ధరణి దేవి మాలగట్టి, ఆర్ట్‌మంత్రం ట్రస్టీ ప్రముఖ కళాకారిణి రేఖారావ్‌లు పాల్గొననున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

కుంబారపేటలో జంటహత్యలు

● మిత్రుడిని రక్షించేయత్నంలో బలి..

బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలో జంటహత్యలు కలకలం రేపాయి. బెంగళూరు నగర నడిబొడ్డున హలసూరు గేట్ పోలీసుస్టేషన్‌కు సమీపాన ఉండే కుంబారపేట శ్రీహరి మార్కెటింగ్‌లోని ఓ గదిలో బుధవారం రాత్రి ఇద్దరు హత్యకు గురయ్యారు. మిత్రదుని చంపేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలోనే అడ్డుకోబోయిన సన్నిహితుడు కూడా బలైపోయారు. సురేష్(55). మహేంద్ర(68)లు హత్యకు గురైన మిత్రులు. సురేష్‌తో పాటు ఇదే ప్రాంతానికి చెందిన దూరపు బంధువు భద్రకు మధ్య ఆస్తి వివాదం ఉంది. ఇదే విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇలా మిత్రుడితో పాటు సురేష్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఆఫీసుగదిలో ఉన్నట్లు తెలుసుకుని భద్ర అక్కడికి చేరుకున్నారు. అంతలోనే గొడవకు దిగారు. పథకం ప్రకారం వెంటతెచ్చుకున్న చాకుతో సురేష్‌ను పొడిచేందుకు భద్ర ప్రయత్నించారు. మిత్రుడు మహేంద్ర తేరుకుని అడ్డుకునే సరికే తీవ్రంగా పొడవడంతో గాయపడ్డారు. మహేంద్ర అడ్డుకునేందుకు రాగా అతడి ఛాతీలోనూ భద్ర పొడిచేశారు. ఒక్కసారిగా కుప్పకూలిన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బయటకు వచ్చిన భద్ర ఇద్దరినీ చంపేశానంటూ కేకలు పెట్టుకుంటూ హలసూరు గేట్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. కుంబారపేటలో సురేష్‌కు కమర్షియల్ కాంప్లెక్స్ ఉంది. అందులోనే బిజినెస్ చేసుకుంటున్నారు. కుంబార సమాజానికి చెందిన ట్రస్టును భద్ర నడుపుతున్నారు. సురేష్ కాంప్లెక్స్ స్థలం సమాజానికి చెందినది ట్రస్టుకు వదిలిపెట్టాలనే విషయమై ఇద్దరి మధ్య పలుమార్లు గొడవ జరిగింది. హత్యకు ఇదే కారణంగా తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆ ఎంపీవన్నీ కోతలే..

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మైసూరు ఎంపీగా ఐదేళ్ళలో ఒక్క పథకాన్ని కూడా తీసుకురాలేకపోయిన ప్రతాప్‌సింహ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో అబద్దాల కోతలు కోస్తున్నారని కేపీసీసీ అధికార ప్రతినిధి హెచ్.ఎ.వెంకటేష్ విమర్శించారు. మైసూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అబద్ధాలు చెప్పుకుంటూ ఐదేళ్ళపాటు కాలహరణం చేసుకొచ్చారన్నారు రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లను కేంద్రంతో పోరాడి మరీ తెచ్చుకోవాల్సిన ఎంపీ ఐదేళ్ళపాటు నిద్రపోయారని ఇప్పుడు మేల్కొని కాకికబుర్లుచెబుతున్నారన్నారు. ఇలాంటి కబుర్లను ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలతో బీజేపీ నేతలకు పిచ్చెక్కి నోటికొచ్చినట్లు లమాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు.

కాంగ్రెస్ వైపు నారాయణగౌడ చూపు

● సీఎంతో రహస్య చర్చలు



బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లాకు చెందిన సీనియర్ రాజకీయ నేత నారాయణగౌడ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. బీజేపీ- జేడీఎస్ పార్టీలు మైత్రికి సిద్ధమైన తరుణంలోనే పార్టీ మారేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. సీఎం సిద్ధరామయ్యను రహస్యంగా కలిసి చర్చలు జరపడం చర్చనీయాంశంగా మారింది. మండ్య జిల్లాలో సుదీర్ఘకాలం పాటు జేడీఎస్‌లో కీలకంగా వ్యవహరించిన నారాయణగౌడ 2019లో గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రిగా పని చేశారు. మండ్య జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేశారు. అటువంటిది వచ్చే లోక్‌సభ ఎన్నికలలో జేడీఎస్‌కు కేటాయించేందుకు బీజేపీ సిద్ధమైందనే విషయం జీర్ణించుకోలేకనే పార్టీని వీడుతున్నట్లు సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. జేడీఎస్‌ను వీడాక కుమారస్వామితో కలిసి పనిచేయరాదని నిర్ణయించారు. కానీ వచ్చే ఎన్నికలలో పొత్తు ద్వారా సమైక్యంగా వెళ్ళాల్సి వస్తుందనే కాంగ్రెస్‌లో చేరదలచినట్లు సమాచారం. మం డ్య కాంగ్రెస్ టికెట్‌ను నారాయణగౌడ కోరినట్లు తెలుస్తోంది. పార్టీలోకి చేరకుండానే అసాధ్యమని తేల్చిచెప్పిన మేరకే పార్టీ ఫిరాయించేందుకు నారాయణగౌడ సిద్ధమైనట్లు సమాచారం.

డెయిరీ సమ్మేళనానికి తెలంగాణ సీఎంకు ఆహ్వానం



డెయిరీ సదస్సుకు సీఎం రేవంతరెడ్డిని ఆహ్వానిస్తున్న కమిటీ ముఖ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దక్షిణభారత స్థాయి పాడిపరిశ్రమ ప్రగతిపై హైదరాబాద్‌లో జరిగే 50వ డెయిరీ పరిశ్రమ సదస్సుకు తెలంగాణ సీఎం రేవంతరెడ్డిని స్వాగతించినట్లు దక్షిణభారత్ విభాగం అధ్యక్షులు సతీష్‌కుమార్ ప్రకటించారు. ఈమేరకు గురువారం సతీష్‌కుమార్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ మార్చి 4నుంచి మూడురోజుల పాటు పాడిపరిశ్రమ ప్రగతికి సంబంధించి జాతీయస్థాయి సదస్సు జరుగుతుందన్నారు. ప్రారంభ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆ హ్వానించామన్నారు. దేశవ్యాప్తంగా మూడువేల మందికి పైగా ప్రతినిధులు భాగస్వామ్యులవుతారన్నారు. పాడిపరిశ్రమలో ఆవిష్కరణలు, పాడి ఉత్పత్తిదారులకు సులభతర పరికరాలు, పాడి పశువుల పెంపకానికి సంబంధించిన అభివృద్ధి పైనా సదస్సులు ఉంటాయన్నారు. దేశమంతటా రైతుకు పంటల సాగుకు ప్రత్యామ్నాయ జీవనంగా పాడిపరిశ్రమ మారిందన్నారు. పాల ద్వారా కొత్త రుచులు ఇక్కడ పరిచయం చేస్తామన్నారు. పాల రైతు అభివృద్ధికే సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం రేవంతరెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ విభాగం అధ్యక్షుడు బీవీకేరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు ఉన్నారన్నారు.



భక్తి శ్రద్ధలతో నందీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మహదేవపుర, ఫిబ్రవరి 8 : స్థానిక హరాడి గ్రామంలో వెలసిన నందీశ్వరస్వామి ఆలయం 6వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గణపతి హోమంతో పాటు పలు పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వార్షికోత్సవాలకు మాజీ మంత్రి అరవింద లింబావళి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామి వారి దర్శనం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి మార్గం ఎంతో మనశ్శాంతిని ప్రసాదిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రముఖులు వెంకటేష్ రెడ్డి, గ్రామ నాయకులు హరాడి పిల్లప్ప, అనూప్ రెడ్డి, ప్రకాష్ బాబు, మహేంద్ర, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో స్వామివారు

రోడ్ భద్రత అందరి బాధ్యత

● జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్

బెంగళూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రోడ్ సేఫ్టీ పౌరులందరి బాధ్యత కావాలని అప్పుడే జీరో ఆక్సిడెంట్ రేట్‌ను అందుకోగలమని రాష్ట్ర ట్రాఫిక్ విభాగ జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్.అనుచేత్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే దిశలో టయోటా కిర్లోస్కర్ ఆధ్వర్యంలో సురక్షతా శిక్షణా కార్యక్రమానికి ఆయన ము ఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోడ్ సేఫ్టీపై ప్రజలను ప్రత్యేకించి యువతను జాగృత పరిచేందుకు సంస్థ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. టీఎస్ఈపీ అమల్లోకి వచ్చాక 31 అంతర్ పాఠశాల క్లబ్‌లు ఏర్పాటయ్యాయని సంస్థ ఉపాధ్యక్షుడు సుదీప్ ఎస్ దాల్వి పేర్కొన్నారు. 5 నుంచి 9 తరగతుల వారికోసమే ప్రత్యేకంగా 25 క్లబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాము నిర్వహిస్తున్న జాగృతి కార్యక్రమాల ఫలితంగా ట్రాఫిక్ క్రమశిక్షణ మెరుగుపడుతోందని ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడుతోందని చెప్పారు.

కుల వివక్షకు పాల్పడలేదు

● నేషనల్ కళాశాల పాలక మండలి

బెంగళూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డా.హెచ్.నరసింహయ్య ఆశయాలకు అనుగుణంగానే 7 దశాబ్దాలుగా తమ సంస్థలలో ఎక్కడా కులవివక్షత చూపలేదని నేషనల్ కళాశాల పాలక మండలి స్పష్టంచేసింది. ఈ మేరకు నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. సొసైటీ నిర్వహణలోని 21 విద్యా సంస్థల్లో అంతర్ బదిలీలు కులమతాలకు అతీతంగా పాలనా పరమైన సౌలభ్యం మేరకే జరుగుతూ వచ్చాయని పేర్కొంది. సొసైటీ నిర్వహణలోని సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి చట్టబద్ధంగా అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని అయితే తమ సంస్థలో కుల ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కొందరు చేసిన ఆరోపణలు తీవ్ర ఆవేదనకలిగించాయని పేర్కొన్నారు. ప్రజల్లో తప్పుడు అభిప్రాయాలు ఏర్పడకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే స్పష్టం చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

బైక్‌లు చోరీచేసే దొంగల అరెస్టు

29 ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 8: ద్విచక్రవాహనాలు చోరీ చేసే నలుగురు దొంగలు పట్టుబడ్డారు. అనంతపురం సీసీఎస్, టూటౌన్, కళ్యాణదుర్గం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితోపాటు ఇద్దరు మైనర్లను పోలీసులు జేజే బోర్డు ఎదుట హాజరు పరిచారు. వారి నుంచి రూ.25లక్షల విలువైన 29 ద్విచక్రవాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు. అరెస్టయినవారిలో అనంతపురం నాలుగోరోడ్డుకు చెందిన నరేష్, పంగల్‌రోడ్డు సమీపంలో ఉంటున్న మహేంద్ర, అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన నాని కుమార్‌లు, మరో ఇద్దరు మైనర్లు మంచి స్నేహితులు. జల్సాలకు బానిసలైన వీరు వాహనాల చోరీలకు పాల్పడుతూ వచ్చారు. ఈ ఐదుగురు పట్టణ ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు, జిల్లా సర్వజన ఆసుపత్రి తదితర రద్దీ ప్రాంతాలకు వెళ్లడం, అక్కడ పార్క్ చేసిన వాహనాలను టార్కెట్ చేసేవారు. నకిలీ తాళాలతో బైక్‌లను ఎత్తుకెళ్లేవారు. అలాంటి వాహనాలను నరేష్ తక్కువ ధరకే విక్రయించి వచ్చిన సొమ్మును జల్సాలకు వినియోగించేవారు ఏడాదిన్నర కాలంలో అనంతపురం టూటౌన్, త్రీటౌన్, తాడిపత్రి, ధర్మవరం, బత్తలపల్లి, కర్నాటక రాష్ట్రం బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో బైక్‌లు దొంగలించారు. నాలుగు రోజుల క్రితం నల్లచెరువు మండల కేంద్రంలో ట్రాక్టర్‌ను దొంగలించి కళ్యాణదుర్గంలో తక్కువ ధరకే విక్రయించారు. బైక్‌లను దొంగతనాల కోసం అద్దెకారును ఉపయోగించేవారు. ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం, సీసీఎస్ టూటౌన్ సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, జనార్దన్, క్రాంతికుమార్, ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుళ్లు బయన్న, శ్రీనివాస్, తిరుమలేష్, కానిస్టేబుళ్లు రంజిత్, శ్రీధర్‌ఫణి, వన్నూరుదాస్, ఆసిఫ్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి వారిని పంగల్‌రోడ్డు సమీపంలో పట్టుకున్నారు. వారి నుంచి 24బైక్‌లు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు.

అప్పులు తీర్చేందుకు చోరీ..

అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటలోని చంద్రబాబునగర్‌కు చెందిన పోతులజాన్ ఇంటి ఖర్చులు, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వారి నుంచి ఒత్తిడి రావడంతో వాటిని తీర్చడానికి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆసుపత్రికి జనం విరివిగా వస్తారని ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. నకిలీ తాళాలతో రెండు నెలల కాలంలో ఐదు ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో అర్బన్ సీఐ హరినాథ్, ఏఎస్ఐ ఖాదర్‌బాషా, కానిస్టేబుళ్లు గంగాధర్, సురేంద్ర, హనుమంతరాయుడు, మహేష్‌లు బృందంగా ఏర్పడి అనంతపురం బైపాస్‌లో నిందితుడిని అరెస్ట్ చేసి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

15న జాబ్‌మేళా

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 8: నిరుద్యోగ యువత కోసం ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా కొంగరెడ్డిపల్లిలోని విజ్ఞానసుధ డిగ్రీ, పీజీ కాలేజీలో జాబ్‌మేళా ఉంటుందని, దాదాపు 100కుపైగా కంపెనీలు ఇందులో పాల్గొంటున్నాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అర్హతను బట్టి వేతనం ఉంటుందన్నారు. చెన్నై, బెంగుళూరుతోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 83744 21195, 81425 09017, 63009 54441 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డాక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 8: తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే డాక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ హరిబాబు గురువారొ ఒక ప్రకటనలో కోరారు. డివిజన్‌లోని తపాలా కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను ఆ రోజున ఉదయం 11 గంటలకు తన కార్యాలయంలో స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారులు ఈనెల 19లోపు పోస్టు ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు. పోస్టు కవరుపై డాక్ అదాలత్ అని తప్పకుండా రాయాలన్నారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం పరిష్కార లెటర్‌ను ఈ-మెయిల్ ద్వారా పంపుతామన్నారు.

అర్హులందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేయాలి : డీహెచ్ఓ



మటమారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీహెచ్ఓ డా.సురేంద్ర బాబు

రాయచూరు, ఫిబ్రవరి 8 : చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చే అర్హులందరిని గుర్తించి వారికి కేంద్ర ప్రభుత్వం ద్వార అందే ఆయుష్మన్ భారత్ కార్డులను అందజేయాలని డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు ఆదేశించారు. గురువారం తాలూకాలోని మటమారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని గదులను పరిశీలించిన డీహెచ్ఓ వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం రోగులకు అందుతున్న సేవల గురించి ఆస్పత్రిలోని బెడ్‌లను పరిశీలించి వారికి అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణను, పరిసరాలను తనిఖీ చేసిన డీహెచ్ఓ, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో తగిన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

చెక్కమగ్గం తయారుచేసే దుకాణం దగ్ధం

ధర్మవరం, ఫిబ్రవరి 8: శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కదిరిగేటు వద్ద చెక్కమగ్గం తయారు చేసే దుకాణం బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైంది. 35 ఏళ్లగా చెక్కమగ్గాలు, మగ్గానికి సంబంధించి సామగ్రిని తయారు చేస్తూ జీవనంసాగిస్తున్నానని, గుర్తు తెలియని వ్యక్తులు దుకాణానికి నిప్పు పెట్టారని బాధితుడు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశాడు. దుకాణం నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు తనకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. దుకాణంలో ఉన్న 350 దోన్లు, మిషన్లు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయని, రూ.12లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బాధితుడిని ఫోన్‌లో పరామర్శించారు. జరిగిన సంఘటనపై ఆరాతీసి భరోసా ఇచ్చారు. అదేవిధంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, గోసల శ్రీరాములు బాధితుడిని పరామర్శించారు. బీజేపీ నాయకులు డిష్‌రాజు, బోడగలగిరిధర్, తుంపర్తిపరమేష్, దుస్సాక్రిష్ణ, నబీరసూల్, నారాయణస్వామియాదవ్, పోరాళ్లరహీం దుకాణాన్ని పరిశీలించి జరిగిన నష్టంపై ఆరాతీశారు.

రజనీకి విజయ్ ఫోన్

● భవిష్యత్తు ప్రణాళికను వివరించిన దళపతి

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో తనకు మనస్పర్థలున్నాయంటూ జరుగుతున్న ప్రచారానికి అగ్రహీరో 'దళపతి' విజయ్ ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. ఆయన స్వయంగా రజనీకి ఫోన్ చేయడంతో పాటు తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం వివరించారు. 'తమిళ వెట్రి కళగం' పేరుతో విజయ్ కొత్త రాజకీయ పార్టీని స్థాపించగా, రజనీకాంత్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఇందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు రజనీకి విజయ్ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ తన కొత్త రాజకీయ పార్టీ సిద్ధాంతాలు, తాజా తదితర అంశాలను వివరించినట్టు సమాచారం. కేవలం పార్టీని స్థాపించడమే కాకుండా, రాజకీయాల్లో రాణించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, మహిళలను, యువతను ఆకట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాల గురించి వారిద్దరి మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా, తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించిన విజయ్.. ప్రస్తుతం తాను కమిట్ అయిన సినిమా ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి రానున్నట్టు ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు విజయ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు.

నేడు 500 ప్రత్యేక బస్సులు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవు రోజులను పురస్కరించుకొని నగరం, ఇతర ప్రాంతాల నుంచి 500 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.మోహన్ విడుదల చేసిన ప్రకటనలో... వారాంతపు రోజులైన శనివారం (ఈ నెల 10వ తేది), ఆదివారం (11వ తేది-శుభముహూర్తాల రోజు) సందర్భంగా చెన్నై సహ ఇతర ప్రాంతాల నుంచి అదనపు బస్సులు నడపనున్నామన్నారు. ఆ ప్రకారం, కిలంబాక్కం నుంచి తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు, కోయంబేడు నుంచి నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు నడపనున్నారు.